క్లుప్తంగా

తహసీల్దార్‌గా అద్దంకి సునీత



ఉప్పునుంతల: మండల తహసీల్దార్‌గా అద్దంకి సునీత శనివారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న తహసీల్దార్ ప్రమీల బదిలీపై వెళ్లగా చారగొండ మండల తహసీల్దార్‌గా పని చేస్తున్న సునీత మండల కేంద్రానికి వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ పథకాలను పారదర్శకతతో అమలు చేయడానికి ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తానని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నరేష్ యాదవ్



అచ్చంపేట రూరల్: యాదవ చైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అచ్చంపేట మండలం బొమ్మనపల్లి గ్రామానికి చెందిన నారమోని నరేష్ యాదవ్‌ను నియమించారు. శనివారం హైదరాబాద్‌లో యాదవ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అయిలేష్ నియామకపత్రం అందజేశారు. నరేష్‌యాదవ్ నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

రవికుమార్‌కు డాక్టరేట్



బిజినేపల్లి: మండలంలోని సల్కరపేట గ్రామానికి చెందిన డేగావత్ రవికుమార్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టాను పొందాడు. కామర్స్ విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పట్టా అందుకున్న రవికుమార్‌ను మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి శనివారం ప్రత్యేకంగా సత్కరించారు. నిబద్ధత కలిగిన కార్యకర్త డాక్టరేట్ పొందడం అభినందనీయమన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్వకుర్తి రూరల్: మండలంలోని గుండూరు విద్యుత్ ఉప కేంద్రంలో మనమ్మతు కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ శ్రీనివాస్ నాయక్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉప కేంద్రం పరిధిలోని గుండూరు, లింగసానిపల్లి, ముకురాల, పంజుగులలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తునట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

బోధన సామగ్రి అందజేత



పెద్దకొత్తపల్లి: మండలంలోని వెన్నచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి శైలేష్ జ్ఞాపకార్థం అతని సోదరుడు రవి పాఠశాల విద్యార్థులకు శనివారం కంపాక్స్ బాక్సులు, పరీక్ష ప్యాడ్లు, నోటు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాము, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు నివాళి



కొల్లాపూర్: మాజీ ఎమ్మెల్యే దివంగత కొత్త వెంకటేశ్వర్‌రావు సేవలు మరువలేనివని టీపీసీసీ నాయకులు రంగినేని జగదీశ్వరుడు అన్నారు. పట్టణంలోని శ్రీవాణి విద్యానిలయంలో శనివారం వెంకటేశ్వర్‌రావు వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు దుస్తులు, చిన్నారులకు నోట్‌పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాది మధుసూదన్‌రావు, నాయకులు స్వామి, వెంకటస్వామి, గోవింద్‌గౌడ్ ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



బిజినేపల్లి: మండలంలోని లట్టుపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్ఎంఎంఎస్ పరీక్షల కోసం క్లాస్‌మెట్ క్లబ్ సభ్యులు స్టడీ మెటీరియల్స్ అందించారు. అదేవిధంగా గ్రామానికి చెందిన విద్యార్థులు చరణ్, శ్రీకాంత్, విజయ్‌లకు రూ.30 ఆర్థికసాయం చేశారు. క్లాస్‌మెట్ ఫౌండర్ వాస రాఘవేందర్, సభ్యులు లక్ష్మి, నాగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, యాదగిరి, లక్ష్మణశర్మ, జెడ్పీహెచ్ఎస్ పాఠశాల హెచ్‌ఎం తిరుపతయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



తాడూరులో కళాశాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీసీ సంఘం, కాంగ్రెస్ నాయకులు



అచ్చంపేట బంద్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ



పెంట్లవెల్లిలో బంద్‌ను నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు



దోమలపెంటలో నినాదాలు చేస్తున్న నాయకులు



కొల్లాపూర్‌లో బీఆర్ఎస్ నాయకులు

బంద్ విజయవంతం

- పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు కసిరెడ్డినారాయణరెడ్డి, వంశీకృష్ణ, అఖిలపక్ష నాయకులు



కల్వకుర్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

సాక్షి, నెట్‌వర్క్: స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాల ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన రాష్ట్ర బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుంచి ఆర్టీసీ బస్సులను నిలిపివేశారు. ఆటోలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. వ్యాపార దుకాణాలను సాయంత్రం వరకు మూసి ఉంచారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం, వివిధ సంఘాల నాయకులు బంద్‌కు సంఘీభావం తెలిపారు. కల్వకుర్తి పట్టణంలోని బస్ డిపో ఎదుట మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పాల్గొని మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ బంద్‌లో పాల్గొని మద్దతు తెలిపారు. . అచ్చంపేటలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిర్వహించిన రాస్తారోకోలో ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పాల్గొని మాట్లాడారు. నాగర్‌కర్నూల్, తెలకపల్లి, పెద్దకొత్తపల్లి, తాడూరు, కొల్లాపూర్, బిజినేపల్లి, కోడేరు, తిమ్మాజిపేట, వెల్దండ, దోమలపెంట, పెంట్లవెల్లి, చారకొండ, ఉప్పునుంతల, లింగాల, మన్ననూర్, బల్మూరులలో స్వచ్ఛందంగా పాటించారు. కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎడ్మ సత్యం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సభ్యులు బాలాజీ సింగ్, బీసీ జేఏసీ నాయకుడు సాదె రాజు, రాష్ట్ర టెలికాం బోర్డు సభ్యుడు శ్రీనివాస్, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లయ్యగౌడ్, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.



కల్వకుర్తిలో బస్టాండ్‌లో నిలిచిన బస్సులు



లింగాలలో బంద్‌లో పాల్గొన్న బీసీ సంఘాల నాయకులు



ఉప్పునుంతలలో పాల్గొన్న అఖిలపక్ష పార్టీల నాయకులు



బిజినేపల్లిలో పాల్గొన్న బీసీ సంఘాల నాయకులు



తిమ్మాజిపేటలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు



లింగాలలో..



పెద్దకొత్తపల్లిలో ధర్నా చేస్తున్న అఖిలపక్ష నాయకులు



తెలకపల్లిలో ధర్నా నిర్వహిస్తున్న అఖిలపక్ష నాయకులు

వార్డులలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు



లింగాల: మండల కేంద్రంలోని పలు వార్డులలో శనివారం ట్రాన్స్‌కో ఏఈ అప్పలనాయుడు పర్యవేక్షణలో స్తంభాలను ఏర్పాటు చేసే పనులను చేపట్టారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ బస్తీ బాటలో భాగంగా ఇప్పటికే గుర్తించిన ప్రాంతాలలో స్తంభాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విరిగిన స్తంభాల స్థానంలో కొత్త స్తంభాల ఏర్పాటుతో పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తున్న లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో సిబ్బంది రఘునందన్, కుర్మయ్య, శివ, భరత్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ బహిరంగ సభ

పెద్దకొత్తపల్లి: సామాజికి తనిఖీ బహిరంగ సభ మొక్కుబడిగా ముగించారు. పది రోజుల పాటు మండలంలో ఎస్ఆర్పీ స్వామి ఆధ్వర్యంలో గ్రామాల్లో జాతీయ హామీ పథకంపై నిర్వహించిన సామాజిక తనిఖీలో రూ.1,12,000 పెనాల్టీ, రూ.1,45,058 రికవరీగా తెల్చారు. పెనాల్టీ, రికవరీలు కలిపి రూ.2,57,258 చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం డీఆర్‌డీఏ, అడిషనల్ పీడీ రాజేశ్వరి ఆధ్వర్యంలో 15వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సభను నిర్వహించారు. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు నిర్వహించిన ఉపాధి హామీ పథకం పనులపై 534 పనులు 5,84,25, 000 ఖర్చు చేశారు. కూలీల వేతనాల కింద రూ.4.22 కోట్లు ఖర్చు చేయగా మేటీరియల్ కింద రూ.1.60 కోట్లను ఖర్చు చేశారు. ఈ పనులపై సామాజిక తనిఖీ ఎస్ఆర్పీ ఆధ్వర్యంలో 10 బృందాలు పది రోజుల పాటు గ్రామాలల్లో తనిఖీలు నిర్వహించి పెనాల్టీ, రికవరీలను తయారు చేశారు. మొత్తం పెనాల్టీ రూ.1,12,000 రికవరీ రూ.1,45,058 మొత్తం రూ.2,57,258 సామాజిక తనిఖీలో వెలికితీశారు. సామాజిక తనిఖీ విభాగం అధికారి నజీర్, అంబుడ్స్‌మెన్ జంగయ్య, సోషల్ అడిట్ క్వాలిటీ కంట్రోలర్ అధికారి కృష్ణారావు, ఎంపీడీఓ నాగేందర్, ఏపీఓ శ్రీనివాసులు, ఎస్ఆర్పీ స్వామి పాల్గొన్నారు.



విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి

వెల్దండ: విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి చెందిన ఘటన శనివారం మండలంలోని రాచూర్‌తండాలో చోటుచేసుకుంది. రైతు వర్యావత్ ఫకీరకు సంబంధించిన కాడెద్దు వ్యవసాయం పొలంలో మేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు తగిలి విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఎద్దు విలువ దాదాపుగా రూ.60వేలు ఉంటుందని పేర్కొన్నారు.

నిందితుడికి జైలుశిక్ష

లింగాల: పోలీసు విధులకు ఆటంకం కలిగించిన మండల కేంద్రానికి చెందిన మాస్కాని అఖిల్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్‌గౌడు శనివారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలో నిర్వహించిన దుర్గామాత నిమజ్జన ఊరేగింపులో అఖిల్ మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు గమనించి ఆపడానికి వెళ్తే దురుసుగా ప్రవర్తిస్తూ విధులకు ఆటంకం కలిగించాడు. నిందితుడిని శనివారం అచ్చంపేట కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించగా కల్వకుర్తి జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

గాలికుంటు వ్యాధి నివారణే లక్ష్యం



చారకొండ: గాలికుంటు వ్యాధి నివారణే లక్ష్యంగా పనిచేస్తున్నామని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి బి. జ్ఞానశేఖర్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం టీకాల వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని వారు తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రాథమిక పశు వైద్య కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అంతకుముందు సిర్సనగండ్ల సీతారామచంద్రాస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పశువైద్య అధికారి శివకుమార్ గౌడ్, సిబ్బంది ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తిమ్మాజిపేట: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రాళ్లచెరువు తండాకు చెందిన రాత్లావత్ హన్మంతు దుందుబీ వాగు నుంచి శనివారం అక్రమంగా ఇసుక ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్నాడు. ఆవంచ సమీపంలో కానిస్టేబుల్ శరత్‌బాబు ట్రాక్టర్ ఆపి విచారించాడు. అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

వెల్దండ: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తునట్లు నాగర్‌కర్నూల్ డివిజన్ డీఈ శ్రీధర్‌శెట్టి అన్నారు. ప్రజాబాట కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని ముదిరాజ్ కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు, వేలాడుతున్న విద్యుత్ తీగల తదితర సమస్యలను పరిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీలో ఏమైన సమస్య ఉంటే సిబ్బందికి ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవాలని ప్రజలకు సూచించారు. అనంతరం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు క్షేత్రస్థాయిలో సందర్శించి విద్యుత్ సమస్యలను గుర్తించారు. కార్యక్రమంలో కల్వకుర్తి డివిజన్ ఏడీఈ శంకరయ్య, ఇన్‌చార్జ్ ఏఈ వెంకటేష్, లైన్‌మెన్ లక్ష్మణ్‌నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.



వృద్ధుడి మృతదేహం లభ్యం

వెల్దండ: మండలంలోని కొట్రకు చెందిన పోనుగంటి అర్జున్‌రావు(60) మృతదేహం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడ వద్ద శనివారం లభ్యమైనట్లు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. ఈనెల 12న అర్జున్‌రావు అదృశ్యమైనట్లు వెల్దండ పోలీస్‌స్టేషన్‌లో సోదరుడు కృష్ణారావు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. అర్జున్‌రావు అనారోగ్యానికి గురికావడంతోపాటు మతిస్థిమిత్తం లేకపోవడంతో గ్రామంలోని పాఠశాల వైపు వెళ్లి కిందపడి మృతిచెందినట్లు అనవాలు ఉన్నాయి. అటువైపు ఎవరూ చూడకపోవడంతో శనివారం దుర్వాసన రావడంతో గ్రామస్తులు గుర్తించారు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని అంత్యక్రియలు నిర్వహించారు.

'వెట్టి' నుంచి విముక్తి

కొల్లాపూర్ రూరల్: మండలంలోని అమరగిరి గ్రామ సమీపంలో ఉన్న కృష్ణానది బ్యాక్ వాటర్‌లో చేపల వేట కోసం వెట్టిచాకిరి చేయించుకోవడానికి కొందరు మోసపూరిత మాటలతో కార్మికులను తీసుకొచ్చారు. శనివారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఆవరణలో కార్మికులకు రెవెన్యూ అధికారులు రిలీజ్ సర్టిఫికెట్లు ఇచ్చారు. లీగల్ సర్వీస్ అథారిటి అధికారుల చొరవతో స్థానిక రెవెన్యూ, పోలీసులు అధికారులు విముక్తి కల్పించారు. ఒడిశా, విశాఖపట్నం పరిధిలోని అరకుకు సంబంధించిన 14 మందిని గుర్తించారు. వారికి ఆర్డీఓ బన్సీలాల్ రిలీజ్ సర్టిఫికేట్లు ఇచ్చి వారి స్వస్థలాలకు అధికారికంగా వాహనాన్ని ఏర్పాటు చేసి పంపించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, తదితరులు ఉన్నారు.

బూత్ కమిటీ అధ్యక్షుల నియామకం



మన్ననూర్: అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామంలో బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షులను ఆ పార్టీ మండల ఎన్నికల ఇన్‌చార్జ్ బల్మూర్ జానకి సమక్షంలో శనివారం నియమించారు. గ్రామంలోని 221 బూత్ కమిటీ అధ్యక్షుడిగా వెలిజాల శ్రీనివాసులు, 222 బూత్ కమిటీ అధ్యక్షుడిగా మంగళగిరి లక్ష్మణ్‌లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో విజయం సాధించడమే ధ్యేయంగా మండలంలో బూత్ కమిటీల నిర్మాణాలను బలోపేతం చేస్తున్నామన్నారు. మండలంలో సర్పంచ్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని సూచించారు. బీజేపీ నాయకులు బాలకృష్ణ, ప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, శివ, శ్రీకాంత్, శ్రీను, తిరుపతి పాల్గొన్నారు.

12 మంది పేకాట రాయుళ్ల అరెస్టు

నాగర్‌కర్నూల్ క్రైం: ఇంట్లో పేకాట ఆడుతున్న 12 మందిని పోలీసులు అరెస్టు చేసినట్లు ఎస్ఐ గోవర్ధన్ శనివారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలో బస్ డిపో సమీపంలో జిల్లా కేంద్రానికి చెందిన వెంకటేష్ ఇంట్లో పేకాట ఆడుతుండగా పోలీసులకు సమాచారం ఇచ్చారు. పేకాట స్థావరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న 12 మందిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పేకాటరాయుళ్ల నుంచి రూ. 1.27 లక్షల నగదు, 12 సెల్‌ఫోన్లు, 5 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

స్వామివారి సన్నిధిలో తులాభారం

తిమ్మాజిపేట: మండలంలోని అప్పాజిపల్లి నరసన్న గుట్టపై స్వయంభూగా వెలసిన లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో శనివారం భక్తులు తులాభారం , సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. వనపర్తి పట్టణానికి చెందిన దాచ లక్ష్మయ్య దంపతులు తన మనువరాలికి నాణేలతో స్వామి వారి సన్నిధిలో తులాభారం చేశారు. అదేవిధంగా స్వామి వారికి పుష్పార్చన కార్యక్రమాలు చేశారు.. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల తనిఖీ

ఉప్పునుంతల: మండలంలోని జయరాం తండాలో శనివారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాలను పీహెచ్‌సీ వైద్యాధికారిణి స్వప్న తనిఖీ చేశారు. సిబ్బంది వ్యాక్సిన్ క్యారియర్‌లో నిల్వ ఉంచిన టీకాలను పరిశీలించారు. ప్రణాళికాయుతంగా ఎంపిక చేసిన వారందరికీ టీకాలు ఇవ్వాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఎంపీహెచ్‌ఓ మధునాయక్, ఏఎన్ఎం దేవీ, వీణ, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

తాడూరు: మండలంలోని ఆకునెల్లికుదురు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బాల వెంకటయ్య బాలపీరు వారం కిందట అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం నిర్వహించిన సంతాపసభలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ఫోరం జాతీయ జెట్టి ధర్మారాజు హాజరై మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు ఐతోలు లక్ష్మయ్య, శివప్రసాద్, రాములు, కేవీపీఎస్ నాయకులు కాశన్న, మాజీ సర్పంచ్ వెంకటయ్య, తదితరులు ఉన్నారు.

సస్యరక్షణపై రైతులకు శిక్షణ

తాడూరు: మండలంలోని తుమ్మలసుగురులో శనివారం వ్యవసాయ కళాశాల పాలెం ఆధ్వర్యంలో రైతులకు సస్యరక్షణ, మందుల అవశేషాల నిర్మూలనపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణలో ప్రొఫెసర్ కవిత మాట్లాడుతూ పెంటమాలాజి తక్కువ విషపూరిత మందులను మాత్రమే కూరగాయలు, ఆకుకూరల పంటలకు పిచికారీ చేయాలన్నారు. మార్కెట్లో కొన్న కూరగాయల పంటలను రెండు శాతం ఉప్పు ద్రావణంలో ముంచి తీసిన తర్వాతనే వాడుకోవాలని రైతులకు తెలిపారు. అధిక మోతాదులో ఎరువులను, కలుపు మందులను ఉపయోగించరాదన్నారు. మిరప, టమాట, బంతినారు, నిమ్మ మొక్కలను అందించారు. మినప పంట క్షేత్ర పరిశీలన చేశారు. పంట పూత దశలో ఉన్నప్పుడు మరక మచ్చల పురుగు పంటను ఆశించిన కారణంగా పొరజిన్ ఎకరాకు 60 మిల్లీలీటర్ల మందును పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎంఆర్ బాను, అసిస్టెంట్ ప్రొఫెసర్ నవత, ఏఈఓ కార్తీక్, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ నవత